# పతిత పతివ్రత

స్మిత

ఆ వాడ వాడంతా ఒక్కసారి గుప్పుమంది.

ఎవరు ఎవరిని పలకరించినా ముందుగా.

"ఇది నిజమేనా" అంటూ జానకీరాణి గురించి ప్రశ్నించటం నిజమైన విషయమే నని రూఢి చేసుకున్నాక తోచిన మాటలు నాలుగు అనడం ఆ వారం రోజులుగా జరుగుతోంది.

"ఆవిడ చేసుకున్న పుణ్యం అలాంటిది. అందుకే ఆలస్యంగా నైనా భగవంతుడు కరుణించాడు" అని ఒకరంటే.

"పుణ్యం మాటేమిటో కాని ఆవిడ చేసిన పూజలూ వ్రతాలూ ఒకటా రెండా? వాటికే ఓ పాతికవేలు ఖర్చు పెట్టి ఉంటుందావిడ అందుకే ఫలితం దక్కింది" అని ఇంకొకరు.

ఇలా లోకం విసిరే మాటలు వెండి కిరణాల్లా మనుషుల మనసుల మీద ప్రతిఫలిస్తున్నాయి.

"మీయమ్మ నీల్లోసు కుందటగా" జానకీరాణి తోటమాలి భార్య మల్లవ్వను పక్క గుడిసెలో ఉంటున్న పోచవ్వ అడిగింది.

"ఆ నీల్లోసుకుంది. ఇంకో ఆర్నెల్లు పోతే బిడ్డని కంటది. ఇదేం ఇసిత్రమా" అంది మల్లవ్వ ఈసడింపుగా

జానకీరాణి భర్త ఆ వూరికి కిరీటం లేని రాజు, ఆ వూళ్లో నాలా మటుకు పొలాలన్నీ అతనివే. వ్యసనాలకు పెట్టింది పేరు.

పాపం జానకీరాణి దివి నుండి భువికి దిగి వచ్చిన అచ్చరకన్య. కల్లా కపటం ఎరుగని పవిత్రమైన వ్యక్తి.

ఇద్దరూ అదృష్టవంతులు. అందమైన జీవితం. కాని ఉన్నలోటు ఒక్కటే.

పెళ్ళి జరిగి పాతిక వసంతాలు గడచినా వాళ్ళకు పిల్లల్లేరు.

రాణీగారు మొక్కని దేవుడు లేడు. చెయ్యని వ్రతంలేదు.

రాజాగారు డాక్టర్ దగ్గరకు వెళ్ళడు. వెళ్తే శరీరంలో జీర్ణించుకుపోయిన సుఖరోగాలు బహిర్గతమౌతాయన్న భయం.

ఇంకో ఏడాది చూసి పిల్లలు పుట్టకపోతే రాజాగారికి మళ్ళీ పెళ్లి చెయ్యాలని బంధుమిత్రులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు.



ఇంతలో రాణీగారి కలలు పండాయి. అదృష్టం దక్కింది.

* * *

తోటమాలి పెళ్ళాం మల్లవ్వ ఓ రోజు తోటలో కూరలూ పూలూ తీసుకుని రాణి గారింటికి వెళ్ళింది.

అప్పుడు రాణీగారు సరదాగా కారులో షికారెళ్ళారు. తీరిగ్గా ఉన్న రాజాగారు మల్లవ్వ కొంగు లాగాడట. మాయామర్మం ఎరగని మల్లవ్వ ఊరూవాడా ఏకం అయ్యేలా అరచింది. ఫలితంగా మాటలు.

"మల్లవ్వ అలగాముండ. రాజా చక్కనివాడు. అది చెప్పినట్టు చెయ్యలేదని ఉల్టా తిరిగింది? అది ఒట్టి తప్పుడు ముండ." మల్లవ్వ కృంగిపోయింది,"

భూమిలో తల దాచుకుంది.

* * *

రాణీగారికి కొడుకు పుట్టాడు. వంశం నిలిచింది. ముందు రాణీగారి పదవి దక్కింది.

* * *

రహస్యం.—రాణీ కొడుకు తోట మాలికీ రాణికీ పుట్టినవాడని ఆ ఇద్దరికి తప్ప ఇంకెవ్వరూ ఎరుగరు. రాజు మళ్ళీ పెళ్ళాడ్తాడేమోనన్న భయం రాణీనలా చేయించింది

జానకీ రాణీ పతివ్రత.

మల్లవ్వ తప్పుడు ముండ పతిత.




